: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 19 | 05-02-2024 | పుటలు : 4

స్నాతకోత్సవ సంచిక







## ఆదికవి నన్నయ యూనివర్సిటీ

# స్నాతకోత్సవం

- యూనివర్సిటీ ఛాన్సలర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా సర్టిఫికేట్స్ ప్రదానం.
- సుధామూర్తికి యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం
- నందమూరి లక్ష్మీపార్వతికి నన్నయ యూనివర్సిటీ డి.లిట్ ప్రదానం
- సాంఘికసంక్షేమ శాస్త్రంలో బంగారు పతకం పొందిన జక్కంపూడి విజయలక్ష్మి
- విద్యార్థులు తమప్రతిభను తమ ప్రాంత సమాజాభివృద్ధికి దోహదం చేయాలని గవర్నర్ పిలుపు



సుధామూర్తికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్

**31.01.24 (మీడియాసెల్)**

విశ్వవిద్యాలయంలో మీరు పొందిన జ్ఞానం, మీరు ప్రపంచ పౌరులుగా మారడానికి సహాయం చేస్తుందని అదే సమయంలో మీ మూలాలను మరువరాదని, మీ ప్రాంతం అభివృద్ధికి స్థిరమైన నిర్ణయాలతో ముందడుగు వేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఛాన్సలర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపు నిచ్చారు. జనవరి 31 బుధవారం రాజానగరం మండల పరిధిలో ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13,14,15 వ స్నాతకోత్సవం సందర్భంగా గౌరవ డాక్టరేట్ గ్రహీత శ్రీమతి సుధా మూర్తి, గోల్డ్ మెడల్ సాధించిన, పిహెచ్.డీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్-ఛాన్సలర్ ఆచార్య కె. పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అకడమిక్ సెనేట్, అధ్యాపకులు, బోధన బోధనేతర సిబ్బంది, విశ్వవిద్యాలయ కళాశాలలు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రముఖులు,అవార్డు గ్రహీతలు మరియు అతిథులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మిగిలిన వార్త 2,3 పేజీల్లో



స్నాతకోత్సవ సభలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గౌరవ డాక్టరేట్ గ్రహీత సుధామూర్తి

# సంపాదకీయం




## భారతీయ విద్య

ప్రపంచంలో ప్రాచీనమైన సంస్కృతుల్లో చెప్పుకోదగింది అభివృద్ధి చెందింది మన భారతీయ సంస్కృతి.సంస్కృతిఅంటే ఒక జీవనవిధానం. ప్రతిజాతికి ఒక సంస్కృతి ఉంటుంది.ఉత్తమమైన జీవన విధానాన్ని ఏర్పరచుకోవటం వల్లనే మన సంస్కృతి గొప్పతనాన్ని సంతరించుకుంది. ఉదాత్తమైన ఆలోచనలే ఉన్నతమైన సంస్కృతికి కారణమౌతాయి.విభిన్న జాతుల జీవన విధానాన్ని ఏకంచేసిన సంస్కృతి మనది. అందుకే భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు నిదర్శనంగా నిలిచింది. దానికి కారణం మన ఆలోచనా ధోరణి మన విద్యావిధానంలో బాగా ప్రతిబింబించింది. యుగయుగాలుగా మానసికోన్నతికి,ఆత్మజ్ఞానానికి మార్గంగా మాత్రమే మనదేశంలో విద్యార్జన జరిగింది. ప్రకృతితో పాటు తనను తాను అర్థం చేసుకోవటమనే ప్రయత్నం ఇందులో అంతర్భాగం.సృష్టి రహస్యంకోసం చేసిన అన్వేషణ భారతీయ సాహిత్య రచనకు ప్రేరణగా నిలిచింది.

భారతీయ జీవన విధానంలో జీవితం అతిసామాన్యమైంది. ఆలోచనలు మాత్రం అత్యంత ఉదాత్తమైనవి. ప్రాచీనమైన భారతీయ సాహిత్యమంతా మన పూర్వీకులు నిర్మించిన మహా నిర్మాణాలుగా భావించొచ్చు. అవన్నీ అనంతమైన విశ్వాన్ని చుట్టి వచ్చే అద్భుతమైన ఆలోచనలు. సామాజిక తత్త్వాన్ని అర్థం చేసుకున్న విశ్లేషణలు. సర్వేభద్రాణి పశ్యంతు... భద్రత,శాంతి,సుఖం ఇవే వారి ఆకాంక్ష. అటువంటి ఆలోచనల్ని, సంప్రదాయాన్ని తర్వాతి తరాలకు అందించటమే వారి ఉద్దేశం. అదే భారతీయవిద్య క్రమంకూడా.

ఆదర్శాలకు, ఆలోచనలకు అక్షర రూపమిచ్చి విస్తారమైన సాహిత్య సృష్టికి వారు దోహదంచేశారు. అదే మన విద్యా విధానం.ఋషులు ద్రష్టలు.వారు తపస్సుచేత సత్యాన్ని ప్రత్యక్షీకరించుకున్నారు. తపస్సు అంటే శుష్కమైన శరీరంతో అడవుల్లో కూర్చుని ఉండటంకాదు. తపస్సు అంటే ఏకాగ్రమైన ఆలోచన.నిరంతరమైన కృషి.గొప్ప ప్రయత్నం అనిఅర్థం.

మన ఋషులు గృహస్థాశ్రమంలో ఉంటూనే సత్యాన్వేషణ చేశారు. ధ్యానం, ఆలోచన, బోధన, నూతన ఆవిష్కరణల ప్రయత్నాలు చేశారు. తపస్సుఅంటే సత్యాన్వేషణ అని మాత్రమేఅర్థం. పరమ సత్యాన్ని కనుక్కుని ఉన్నత స్థితికి చేరటమే నాటి విద్య లక్ష్యం. ఆ విధంగా ప్రతి ఋషి ఒక ఉపాధ్యాయుడయ్యాడు. ప్రతి కుటుంబం ఒక గురుకుల పాఠశాల అయింది.శ్రద్ధ,శుచి,అప్రమత్తత, జ్ఞానతృష్ణ అనే లక్షణాలు విద్యార్థి కలిగి ఉండాలని,భాషలపట్ల అధికారాన్ని సముపార్జించుకోవాలని, సత్ప్రవర్తన, క్రమశిక్షణ విద్యార్థికి ఉండాల్సిన తప్పనిసరి లక్షణాలు కావాలని గురువులు సూచించారు. ఇవాళ మనం కమ్యూనికేషన్ స్కిల్స్ అంటున్నది అదే.

వైభవోపేతమైన సమాజ నిర్మాణానికి భారతీయ విద్యా విధానంలోని ఈ సంప్రదాయ భావధారను కొనసాగించటానికి కావలసిన పద్ధతుల్ని మనం పునరాలోచించుకోవాలి. మార్కులు,గ్రేడులే కాకుండా మనకు కావలసిన విలువల్ని గుర్తించాలి. అప్పుడు మాత్రమే వ్యక్తికి, సమాజానికి సమన్వయం కలిగి సంక్షోభం తొలగుతుంది.

# ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్నాతకోత్సవం

(మొదటి పేజీ నుంచి)

ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ గౌరవశ్రీ ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్శిటీ, భవిష్యత్తులోకి అడుగు పెట్టడానికి, మీకు సంపూర్ణమైన విద్యను అందించిందని నాకు నమ్మకం ఉందన్నారు. ఈ రోజు ఉత్తీర్ణత సాధించిన కొత్త గ్రాడ్యుయేట్లందరికీ అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. పట్టుదల మరియు కృషి కారణంగా మీరు ఈ ముఖ్యమైన మైలురాయిని సాధించారన్నారు. "విద్య అనేది ఒక కుండను నింపడం కాని దాని యొక్క ఫలితాలను సమాజ శ్రేయస్సుకు సమర్థవంతంగా వినియోగించడంలో చూపే చతురత అని అన్నారు.మీరు సంపాదించిన జ్ఞానం సంకుచిత, మతపరమైన ఆలోచనలకు దారితీయకూడదన్నారు. జీవితంపై విస్తృత మరియు సానుభూతితో కూడిన అవగాహనకు దారితీయాలని, విశ్వవిద్యాలయంలో మీరు పొందిన జ్ఞానం, మీరు ప్రపంచ పౌరులుగా మారడానికి సహాయం చేస్తుందన్నారు.ఈ విశ్వవిద్యాలయానికి తెలుగు సాహిత్యంలో గొప్ప కవి నన్నయ పేరు పెట్టబడిందని, అతని కవితా దృష్టి అసమానమైనదని, స్వేచ్ఛానువాదం, మానవ సంస్కృతి అభివృద్ధిలో ఒక గొప్ప యుగంగా పేర్కొన్నారు. గొప్ప ఇతిహాసమైన మహాభారతాన్ని అనువదించే ప్రయత్నంలో, కవి ధర్మం వైపు మానవీయ విలువల యొక్క గొప్ప పరివర్తనను దృశ్యమానం చేసిన మహోన్నత వ్యక్తిగా గవర్నరు పేర్కొన్నారు.


గవర్నర్ కి స్వాగతం పలుకుతున్న ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు


గవర్నర్ కు స్వాగతం పలుకుతున్న రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్

డిగ్రీలు పూర్తి చేసిన యువ గ్రాడ్యుయేట్‌లుగా, ఈ దేశం యొక్క ప్రతిష్టాత్మకమైన ఆదర్శాలను, మన రాజ్యాంగాన్ని,మన ప్రాచీన వారసత్వం యొక్క సార్వత్రిక విలువలను సమర్థించడం మీ కర్తవ్యమని స్పష్టం చేసారు. సత్యమే విజయం సాధిస్తుందని మీ అందరు గుర్తెరిగి బాధ్యతతో కూడిన పౌరులుగా అడుగు వేయాలని కోరారు.భారత దేశ సంస్కృతిలో మమేకమైన ఆధ్యాత్మిక విద్యలో మార్గదర్శకత్వం కోసం ప్రపంచం మొత్తం మన వైపు చూసి విశ్వ గురువుగా ఒక ప్రత్యేక స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. యూనివర్సిటీ నుంచి డిగ్రీలు పొందిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి బాధ్యతాయుతమైన పౌరులుగా సమాజాభివృద్ధి కృషిచేయాలని పేర్కొన్నారు. జాతీయ నూతన విద్యావిధానం 2020 లక్ష్యంగా రానున్న 15 సంవత్సరాల్లో ఉన్నత విద్యలో భాగస్వామ్య రేటును రెట్టింపు చేయాలనే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. అందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నైపుణ్యాభివృద్ధితో కూడిన విద్యావిధానాన్ని అమలు చేస్తున్నామన్నారు.

నేడు ప్రపంచం వాతావరణ మార్పుల పెను ముప్పును ఎదుర్కొంటోందని, పర్యావరణ కాలుష్యం గ్లోబల్ వార్మింగ్, అనూహ్య వాతావరణ మార్పులకు దారి తీస్తోందని , ఇది జీవుల మనుగడకే హానికరంగా మారుతోందన్నారు. "ప్రతి మనిషి అవసరాలను తీర్చడానికి భూమి తగినంతగా అందిస్తుందని , కానీ ప్రతి మనిషి దురాశతో మరింతగా ప్రయత్నించడం జరగుతోందన్నారు. సామరస్యపూర్వక జీవనానికి దారితీసే అంతరాయం కలిగించే సాంకేతికతలను మనం దృష్టిలో పెట్టుకొని వాటిని అధిగమించే దిశగా కృషిచేయాలన్నారు.

2047 నాటికి, బ్రిటీష్ వలసవాదం నుండి మన స్వాతంత్ర్యం యొక్క శతాబ్ది వేడుకలను జరుపుకుంటామన్నారు. ఇప్పటి నుండి దేశానికి స్వాతంత్ర్య శతాబ్ది సంవత్సరానికి దారితీసే కాలాన్ని మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమృత్ కాల్ అని పేర్కొన్నారు. అప్పటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని మన దేశం ఎదురుచూస్తోందని, యువ విద్యార్థులుగా, విక్షిత్ భారత్ఏ2047 యొక్క విజన్‌ను సాకారం చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు.మన దేశం అన్ని రంగాలలో సమానమైన మరియు న్యాయమైన సమాజంగా అభివృద్ధి చెందేలా చూడటం మీ లక్ష్యం. సమ్మిళిత అభివృద్ధి మన మార్గదర్శక తత్వశాస్త్రంగా ఉండాలనే డా.బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను ఆచరించాలన్నారు.

మన దృక్పథం ఎల్లప్పుడూ మన ప్రాచీన దృష్టికి అనుగుణంగా ఉండాలని "ఆనో భద్రాః క్రతవోయంతు విశ్వతః" అన్ని వైపుల నుండి జ్ఞానం రావాలని, అందువల్ల, మన నాగరికత యొక్క ప్రత్యేకతను గ్రహించి ఆమేరకు కృషి చేయాలని యువ గ్రాడ్యుయేట్‌లకు పిలుపునిస్తున్నానన్నారు.ఈ యూనివర్సిటీ రానున్న రోజుల్లో మన దేశంలోని ప్రధాన సంస్థలలో ఒకటిగా ఎదగాలని కోరుకుంటున్నట్లు గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేసారు. గ్రాడ్యుయేట్ అయిన విద్యార్థులందరికీ, బంగారు పతకాలు, మెరిట్ సర్టిఫికేట్‌లు గెలుచుకున్న విద్యార్థులందరికీ మరోసారి అభినందనలు తెలియజేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకోసం ఆకాంక్షను వ్యక్తం చేసారు.

స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, ప్రముఖ రచయిత్రి, సేవామూర్తి సుధామూర్తి విశ్వవిద్యాలయం నుండి ఛాన్సలర్ మరియు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సుధామూర్తి మాట్లాడుతూ ఇక్కడ ఉత్తీర్ణత సాధించి బయటి ప్రపంచానికి వెళ్తున్న విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఎన్నో పరీక్షలు ఎదుర్కోవాలన్నారు. విద్యార్థి స్థాయిలో రాసే పరీక్షలకు సిలబస్ , ఉపాధ్యాయులు ఉన్నారని, జీవిత పరీక్షలకు నిర్దిష్టమైన సిలబస్ లేదని పరిస్థితులకు అనుగుణంగా వాటిని ఎదుర్కోవలసి ఉంటుందని ఆమె అన్నారు. మనకు తల్లితండ్రులు జీవన విధానాన్ని తెలియజేస్తే భవిష్యత్తులో ఎలా జీవించాలో బోధించే ఉపాధ్యాయులు అంతే కీలకమన్నారు.యువత డబ్బు వెంట పరుగెత్తడం ద్వారా నైతిక విలువలను, ధర్మాన్ని వదులుకోవద్దని ఆమె అన్నారు. అవుట్‌గోయింగ్ గ్రాడ్యుయేట్‌లు న్యాయమైన మరియు విలువ ఆధారిత మార్గంలో డబ్బు సంపాదించడానికి నిరంతరం కష్టపడాలని ఏదీ కూడా అనాయాసంగా రాదన్న విషయాన్ని గుర్తెరగాలని ఆమె సలహా ఇచ్చారు. జీవితంలో ఎదగాలంటే కష్టపడి పనిచేయటమే మార్గమని, దగ్గర దారులు ఉండవని హితవు పలికారు. జీవితమంటే వడ్డించిన విస్తరి అని కేవలం అన్నం మాత్రమే కాదని సుధామూర్తి తెలిపారు. పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటూ ఒడిదుడుకులకు లోనుకాకుండా జీవితాన్ని నిర్మించుకోవాలని ఆమె అన్నారు. అహింస, ఇంద్రియనిగ్రహం, దయ, క్షమ, దానం, యోగం, సత్యసంపూర్ణత వంటి సద్గుణాలతో

⏭ మిగిలింది... 3లో..


గవర్నర్ చేతుల మీదుగా తెలుగు సాహిత్యంలో డి.లిట్. పట్టానందుకున్న లక్ష్మీపార్వతి

# ఆదికవి నన్నయ యూనివర్సిటీ  స్నాతకోత్సవం


గవర్నర్ నుండి గోల్డ్ మెడల్ అందుకున్న జక్కంపూడి విజయలక్ష్మి


గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్డీ పట్టానందుకున్న నైనా జైస్వాల్

జీవించాలని చెప్పే ఉపనిషత్ శ్లోకాలను సుధా మూర్తి ఉదహరించారు.

నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజు యూనివర్సిటీ నివేదికను వివరిస్తూ నన్నయ విశ్వవిద్యాలయంలో 2019-20, 2020-21, 2021-22 విద్యాసంవత్సరానికి చెందిన పిహెచ్.డీ, పీజీ, పీజీ డిప్లొమా, యూజీ అండ్ పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారికి పట్టాలు అందిస్తున్నట్లు ముఖ్యఅతిధి ఛాన్సలర్ మరియు రాష్ట్ర గవర్నరు ఎస్. అబ్దుల్ నజీర్ కు నివేదిక సమర్పించారు. ఈ రోజు జరిగే  కార్యక్రమంలో  13,14,15వ స్నాతకోత్సవానికి వివిధ కోర్సులకు చెందిన 500 మంది విద్యార్థులు అప్లై చేసుకున్నారని తెలిపారు. ఈ 500 మందిలో పిహెచ్.డి 12, గోల్డ్ మెడల్స్ 12, ప్రైజ్ 12, మిగిలిన వారు పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్.ఎల్.ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్.ఎల్.బి., బీఈడీ వంటి కోర్సులు పూర్తి చేసిన వారు ఉన్నారని ఆయన  తెలిపారు. మూడు విద్యా సంవత్సరాలలో విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 8582, అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 50173 మంది విద్యార్థుల పట్టాలు ఆమోదించడం జరిగిందని పద్మరాజు వెల్లడించారు.   కార్యక్రమంలో భాగంగా యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య  జి. సుధాకర్ ముగింపు కార్యక్రమంలో భాగంగా కృతజ్ఞతలు తెలిపారు.  ఈ సందర్భంగా తెలుగు భాషా సంఘం అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతికి విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుండి "ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజానేతల జీవితాలు" అనే అంశం పై పరిశోధనే చేసినందుకు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ డి.లిట్ అత్యున్నత పట్టాను గవర్నరు అందజేశారు. సాంఘిక సంక్షేమ శాస్త్రంలో పీజీ చేసిన సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మికి బంగారు పతాకాన్ని  గవర్నరు అందజేసారు.           కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ కె.పద్మరాజు, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి, ప్రభుత్వానికి ఉమ్మడి ఆర్థిక సలహాదారు ఆర్థిక శాఖ డి.సురేంద్ర, యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్ ,ఈసీ సభ్యులు,డా.పి. విజయనిర్మల ,డా.కె.నూకరత్నం , డా.జ్యోతి,శ్రీమతి ఎం.వసంత లక్ష్మి,డా. షేక్ సులేమాన్ ,డా. జి. నారాయణరావు,జి. రాజ్ కుమార్,వై. సత్యనారాయణ,ఆచార్య పి. సురేష్ వర్మ, ఆచార్య కె.ఎస్. రమేష్,ఆచార్య వై. శ్రీనివాసరావు, ఆచార్య డి.జ్యోతిర్మయి,డా.పి. వెంకటేశ్వరరావు ,ఆచార్య కె. సుబ్బారావు,ఆచార్య ఎస్. ప్రశాంతిశ్రీ ,ఆచార్య టి. అశోక్, డా.కె.రమణేశ్వరి, డా.ఎ.మట్టా రెడ్డి ,డా.వి.పెర్సిస్ ,ఎస్.లింగారెడ్డి, రాష్ట్ర హౌసింగ్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి , శాసనసభ్యులు జక్కంపూడి రాజా, ప్రజాప్రతినిధులు అధికారులు, విద్యార్థులు వారి తల్లి తండ్రులు  విశ్వవిద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య కె.పద్మరాజు


సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్







స్నాతకోత్సవానికి హాజరైన నాలుగువందలకు మంది పైగా

విద్యార్థులకు పట్టాలు అందజేసిన విశ్వవిద్యాలయ అధికారులు

# పట్టాల పండుగ

## 400 మంది పైగా పీజీ పట్టాలు ప్రదానం





**31.01.24 (మీడియాసెల్)**

13,14,15వ స్నాతకోత్సవానికి వివిధ కోర్సులకు చెందిన 500 మంది విద్యార్థులు అప్లై చేసుకున్నారు. ఈ 500 మందిలో పిహెచ్.డి 12, గోల్డ్ మెడల్స్ 12, ప్రైజ్ 12.వారికి గవర్నర్ అబ్దుల్ నజీర్, సుధామూర్తి చేతుల మీదగా పట్టాలను అందజేశారు. అనంతరం మిగిలిన పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్.ఎల్.ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్.ఎల్.బి., బీఈడీ వంటి కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి, వీసీ ఆచార్య కె. పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్ మరియు విశ్వవిద్యాలయ అధికారుల చేతుల మీదుగా సుమారు నాలుగు వందల మందికి పైగా విద్యార్థులకు ప్రత్యక్షంగా పట్టాలను ప్రదానం చేశారు. స్నాతకోత్సవ వేదికపై పట్టాలు ప్రదానం చేయడం చాలా ఆనందంగా ఉంటుందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. మూడు విద్యా సంవత్సరాలలో విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 8582, అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 50173 మంది విద్యార్థుల పట్టణాలకు ఆమోదం లభించింది. విశ్వవిద్యాలయంలో విద్యాపరమైన అతిపెద్ద పండుగ స్నాతకోత్సవం అందరి సహకారంతో విజయవంతంగా జరిగింది.




స్నాతకోత్సవ ప్రొసిడింగ్స్ చదువుతున్న వీసీ ఆచార్య కె.పద్మరాజు




గవర్నర్ ను సన్మానించి జ్ఞాపికనందజేస్తున్న దృశ్యం



స్నాతకోత్సవానికి హాజరైన పూర్వ వీసీలు ఆచార్య కె.నిరూపరాణి, ఆచార్య పసలపూడి జార్జ్ విక్టర్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



# పట్టాభిషేకం



గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు తీసుకుంటున్న విద్యార్థులు



# పట్టాభిషేకం























గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు తీసుకుంటున్న విద్యార్థులు

# పట్టాభిషేకం



గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు తీసుకుంటున్న విద్యార్థులు








రోబ్ యాప్స్ ఎగురవేస్తూ స్నాతకోత్సవంలో విద్యార్థుల ఆనందోత్సాహాలు

## స్నాతకోత్సవానికి అందంగా ముస్తాబైన నన్నయ భవనాలు









# గౌరవ డాక్టరేట్ అందుకోవడం ఆనందంగా ఉంది

## ఇన్ఫోసిస్ వ్యవస్థాపకురాలు, పద్మభూషణ్ సుధామూర్తి

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి సతీమణి, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ అత్తగారు, కంప్యూటర్ ఇంజనీర్, రచయిత్రి, వితరణశీలి, సంఘసేవకురాలు ఇలా చెప్పుకుంటే మరెన్నో ప్రత్యేకతలను సంతరించుకున్న మహిళా ఆదర్శమూర్తి పద్మభూషణ్ సుధామూర్తికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా హానరరీ డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డి.లిట్) ప్రదానం చేశారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మరియు విశ్వవిద్యాలయ అధికారులు, అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులంతా సుధామూర్తికి డి.లిట్ ప్రదానం చేయడం స్నాతకోత్సవానికి హైలెట్ గా నిలిచిందని ప్రశంసించారు.




**నన్నయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గౌరవ పట్టాను అందుకున్న ఫౌండేషన్ చైర్ పర్సన్, పద్మభూషణ్ సుధామూర్తితో పి.ఆర్.వో ఆనంద్ ముఖాముఖి.**

**మేడమ్... నన్నయ యూనివర్సిటీ హానరరీ డి.లిట్ ప్రదానంపై మీ అభిప్రాయం**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం హానరరీ డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డి.లిట్) అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. నన్నయ స్నాతకోత్సవం చాలా అద్భుతంగా జరిగింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉపన్యాసం అందరిని ఆకట్టుకుంది. ముఖ్యంగా విద్యార్థులకు ఉపయోగపడే అంశాలు చాలా ఉన్నాయి. విద్యార్థులు ఇటువంటి ఉపన్యాసాల ద్వారా స్ఫూర్తిని పొందుతారు. స్నాతకోత్సవాన్ని హుందాగా నిర్వహించిన విశ్వవిద్యాలయ వీసీ, రిజిస్ట్రార్, అధికారులకు అభినందనలు.

**రామమహేంద్రవరం పర్యటన ఎలా జరిగింది...**

తొలిసారిగా చారిత్రక నగరమైన రాజమహేంద్రవరానికి విచ్చేసాను. రాజమండ్రి నగరం చాలా అందంగా ఆహ్లాదకరంగా ఉంది. గోదావరి నదిపై బోట్ షికార్ చేసాను. కడియం నర్సరీలు చాలా చాలా అందంగా ఉన్నాయి. ఇటువంటి వాతావరణాన్ని నేను ఎప్పుడూ చూడలేదు. చాలా పులకరించి ఈ వాతావరణాన్ని ఎంజాయ్ చేసాను. అలాగే రాజమండ్రిలోని మణికంఠ పుస్తకాల షాపును విజిట్ చేసాను. నాకు సాహిత్య పుస్తకాలు అంటే చాలా ఇష్టం. తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలను తీసుకున్నాను.

**తెలుగు సాహిత్యానికి మీరు చేసిన కృషి...**

నేను వ్రాసిన 25 పుస్తకాలు తెలుగులో అనువాదం అయ్యాయి. అశోక్ గారు అలకనందా పబ్లికేషన్ వారిచే పబ్లిష్ చేయబడ్డాయి. కన్నడం, తెలుగు సాహిత్యాలు ఒకే విధంగా ఉంటాయి. సంస్కృతం నుండి కన్నడం లోనికి అనువాదం అయిన సాహిత్యం, సంస్కృతం నుండి తెలుగులోనికి అనువాదం అయిన సాహిత్యం అపారంగా ఉంటుంది. ఆదికవి నన్నయ భారతాన్ని సంస్కృతం నుండి అనువాదం చేసారు. నాకు నన్నయ సాహిత్యం తెలుసు. నన్నయ పేరుతో ఏర్పడిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను.

ఇన్ఫోసిస్ అధ్యక్షురాలు పద్మభూషణ్ డా.సుధామూర్తి భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, మరింత మంది ఆమె సేవలను అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాం. నన్నయ గౌరవ డి.లిట్ గ్రహీత సుధామూర్తికి నన్నయవాణి కృతజ్ఞతల్ని అందిస్తుంది.

**ధన్యవాదాలు మేడమ్**

## సుధామూర్తి

**జననం :** 1950 ఆగస్టు 19
షిగ్గాన్ కర్ణాటక
భారతదేశం

**పౌరసత్వం:** భారతదేశం

**విద్యాసంస్థ:** బి.వి.బి సాంకేతిక కళాశాల
ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్

**వృత్తి** అధ్యక్షురాలు , ఇన్ఫోసిస్ ఫౌండేషన్

**జీవితభాగస్వామి:** ఎన్.ఆర్.నారాయణ మూర్తి

**బంధువులు:** రిషి సునాక్ (అల్లుడు)

**పురస్కారాలు**

2004 – సామాజిక సేవకు గానూశ్రీ రాజా లక్ష్మీ పురస్కారం, రాజాలక్ష్మి ఫౌండేషన్, చెన్నై నుండి అందుకున్నారు.

2006 – భారత ప్రభుత్వము నుండి అత్యుత్తమ పద్మశ్రీ పురస్కారము , సామాజిక సేవ, దాతృత్వం , విద్యా రంగాలలో ఆమె సేవలకు గౌరవ డాక్టరేటు.

మనదేశంలో న్యాయ విద్య , ఉపకారవేతనాల అందవేతకు ప్రముఖ న్యాయవేత్త సంతోష్ హెగ్డే తో కలిసి గౌరవ న్యాయ డాక్టరేట్ ( honorary LL.D (Doctor of Laws)).

సాహితీ సేవ , ఆమె రచనలకు ఆర్. కె. నారాయణన్ పురస్కారం.

ఆమె 2011లో కన్నడ సాహిత్యంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అట్టిమబ్బే' (Attimabbe) అవార్డు గ్రహీత.

2023 –పద్మ భూషణ్ అవార్డు.

2023 – గ్లోబల్ ఇండియన్ అవార్డు. దీనిని కెనడా ఇండియా ఫౌండేషన్ (CIF) వారు ప్రదానం చేసారు. ఆమె భర్త నారాయణ మూర్తి కి ఇదే పురస్కారం 2014 లో లభించింది. వారు ఈ అవార్డు తీసుకున్న మొదటి జంట. దీని విలువ $50,000. ఆమె ఈ మొత్తాన్ని ది ఫీల్డ్ ఇన్స్టిట్యూట్ (టొరంటో విశ్వవిద్యాలయం)కు విరాళంగా ఇచ్చారు.

**రచనలు :**

ఆమె పిల్లలకు పెద్దవాళ్లకు జీవితంతో నేర్చుకోవలసిన పాఠాలను కథల రూపంలో అందించింది.

మదర్ ఐ నెవెర్ న్యూ (Mother I Never Knew: Two Novellas) – 2 నవలలు

మేజిక్ ఆఫ్ ది లాస్ట్ టెంపుల్

హౌ ఐ టాట్ మై గ్రాండ్ మదర్ టు రీడ్ అండ్ ఆథర్ స్టోరీస్

వైస్ అండ్ అదర్ వైస్

మేజిక్ డ్రమ్ అండ్ ఆదర్ ఫేవరేట్ స్టోరీస్

3000 స్టిచెస్: ఆర్డినరీ పీపుల్ ఎక్స్ట్రార్డినరీ లైవ్స్ (Three Thousand Stitches: Ordinary People, Extraordinary Lives)

గ్రాండ్ మా'స్ బాగ్ అఫ్ స్టోరీస్

### మంచిమాట




గోదావరిపై బోట్ షికార్ చేస్తూ ఆనందిస్తున్న సుధామూర్తి





మార్కండేయ స్వామి గుడిలో సుధామూర్తి పూజలు

## ఉపకులపతి ఉవాచ



**నమస్సులు!**

*స్నాతకోత్సవం విద్యార్థుల జీవితాల్లో జ్ఞాన దీపోత్సవం. పరమపట్టభద్రులై ప్రగతి మార్గాల వైపుకి ప్రయాణించే సందర్భం స్నాతకోత్సవం.*

*జనవరి 31 స్నాతకోత్సవానికి విచ్చేసిన ఆహుతులైన పెద్దలకు, శ్రేయోభిలాషులకు, విద్యార్థులకు ధన్యవాదాలు! కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయటానికి సహకారమందించిన విశ్వవిద్యాలయ సిబ్బంది అందరికీ నా కృతజ్ఞతలు!!*

ఆచార్య కె.పద్మరాజు